
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 11 జూలై 2024



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	24.6	38.8
భద్రాద్రి	26	32



రైతులు, రైతు సంఘాల నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు



సదస్సుకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

అందరి అభీష్టం మేరకే 'రైతు భరోసా'

- నిజమైన రైతులందరికీ పెట్టుబడి సాయం అందేలా చూస్తాం
- చట్టసభల్లో చర్చించిన తర్వాతే విధివిధానాల రూపకల్పన
- 'రైతుబంధు' పేరుతో గత ప్రభుత్వం రూ. వేల కోట్లు దుర్వినియోగం చేసింది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి
- ఖమ్మం కలెక్టరేట్‌లో 'రైతు భరోసా' పథకంపై వర్క్‌షాప్

ఖమ్మం, జూలై 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులు, రైతు సంఘాల సూచనలు, సలహాల ప్రకారమే రైతుభరోసా విధివిధానాలు రూపొందిస్తామని, వాటిపై చట్టసభల్లో చర్చించిన తరువాతనే రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని క్యాబినెట్ సబ్ కమిటీ కన్వీనర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతుభరోసా విధివిధానాలపై రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన రైతులు, రైతు సంఘాల నేతలు, వివిధవర్గాల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్ర వనరుల, సంపదను ధర్మబద్ధంగా ప్రజలకు పంచడమే ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రజల చెమట, శ్రమ ద్వారా పన్నుల రూపేణ రాష్ట్ర ఖజానాకు చెల్లించిన ప్రతి పైసా దుర్వినియోగం కాకుండా తిరిగి ప్రజలకు పంచుతామన్నారు. రైతుభరోసా కింద రైతులకు అందించే సాగు సాయం ఎలా అందించాలన్న విషయంపై రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమన్నారు. ఖమ్మం జిల్లా నుంచే రైతుభరోసా వర్క్‌షాప్‌లను ప్రారంభించామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోగా అన్ని జిల్లాలో పర్యటించి వచ్చిన సలహాలు సూచనలను అసెంబ్లీలో ఉంచుతామన్నారు. అక్కడ చర్చించిన తర్వాతనే విధివిధానాలు రూపొందిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రైతుభరోసాపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. అపోహలు, దుష్ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ప్రజాప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి కాపాడుకుంటుందన్నారు.

గత ప్రభుత్వం రైతుబంధు పథకంతో ప్రజల సొమ్మును ఇష్టానుసారంగా పంపించిందన్నారు. రైతులతో చర్చించకుండా హైదరాబాదులో నిర్ణయాలు తీసుకుని సాగుభూములకు కాకుండా కొండలు గుట్టలు, చెరువులు, వాగులు రియల్‌ఎస్టేట్ ప్లాట్లకు కూడా రైతుబంధు పథకం ఇచ్చి ప్రజల సొమ్మును అనర్హులకు పంచిందన్నారు. ఎన్నికల ముందు కూడా రైతుబంధు నిధులను సమయానుకూలంగా విడుదల చేయకుండా పెండింగ్‌లో పెట్టడంతో ఆ తర్వాత అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అందరు రైతులకు సాగు సాయం అందించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టిన తర్వాత రాష్ట్రానికి శాఖల వారీగా నిధుల కేటాయింపును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందన్నారు. గతంలో లోక్‌సభ ఎన్నికల ముందు కేవలం ఓటాన్‌అకౌంట్ బడ్జెట్ మాత్రమే ప్రవేశపెట్టామని, వచ్చే బడ్జెట్‌లో రైతుల సూచనలు, సలహాలకు అనుగుణంగా రైతుభరోసాకు కేటాయింపులుంటాయని తెలిపారు. అన్ని జిల్లాల నుంచి సేకరించిన అభిప్రాయాలను నివేదిక ద్వారా రూపొందించి చట్టసభల్లో చర్చిస్తామని ప్రకటించారు.

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సాగు చేసే నిజమైన రైతులకే రైతుభరోసా అందించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గతంలో రైతుబంధు పేరుతో సాగులో లేకపోయినా పాస్ పుస్తకాల్లో ఉన్న అన్ని రకాల భూములకు రైతుబంధు అందించారని గుర్తు చేశారు. వ్యవసాయం చేసే రైతులు నష్ట పోకుండా వారికి సకాలంలో పెట్టుబడి అందించి ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమన్నారు. కొందరు రైతుభరోసాపై చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు. రైతుల సలహాలు, సూచనలకు (మిగతా 5వ పేజీలో)

ఆద్యంతం ఉత్సాహంగా...

- ఫలవంతంగా ముగిసిన రైతుభరోసా వర్క్‌షాప్
- అభిప్రాయాలు వెల్లడించిన 38 మంది ప్రతినిధులు
- రైతులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన మంత్రులు
- అభిప్రాయాలకు, ప్రశ్నలకు వెనువెంటనే స్పందన

ఖమ్మం కలెక్టరేట్, జూలై 10: రైతుభరోసా పథకం అమలుపై ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం వర్క్‌షాపు ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. రైతు భరోసా పథకం కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఉదయం 10.30కి ప్రారంభమైన సమావేశంలో భట్టితో పాటు మంత్రులు తుమ్మల, పొంగులేటి పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 200 మంది రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు, అన్ని పార్టీల రైతుసంఘాల నాయకులు ఈ సమావేశంలో హాజరయ్యారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన సమావేశంలో 38 మంది రైతులు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. రైతులు, రైతుసంఘల నాయకులు, కౌలు రైతులు, డాక్టర్లు, అడ్వకేట్, జర్నలిస్టులు, శాస్త్రవేత్తలు, పలువురు రైతుభరోసా పథకం తీరుతెన్నులు ఎలా ఉండాలో తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా భట్టితో పాటు మంత్రులు తుమ్మల, పొంగులేటి రైతులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రైతులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్న క్రమంలో మంత్రులు జోక్యం చేసుకుంటూ ప్రభుత్వ ఉద్దేశాలను వివరించారు. చంద్రుగొండకు చెందిన రైతు భోజ్యానాయక్ రైతులకు కౌలు రైతులకు మధ్య ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకురావాలంటూ (మిగతా 5వ పేజీలో)



పదెకరాల లోపు రైతులకు చాలు
- డాక్టర్ వై.ప్రసాద్, ఖమ్మం



రాయితీలను పునరుద్ధరించాలి
శ్రీనివాసరావు, న్యాయవాది, ఖమ్మం



పంటల బీమాను అమలు చేయాలి
- బాగం హేమంతరావు, సీపీఐ నేత



ప్రతి రైతుకూ బోనస్ అందించాలి
-బొంతు రాంబాబు, రైతు సంఘం నాయకుడు

వివరాలు : 5లో

పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు

- కౌన్సెలింగ్ ద్వారా పకడ్బందీగా ప్రక్రియ చేపట్టాలి
- తప్పనిసరిగా బదిలీ అయ్యే వారి జాబితాను ప్రదర్శించాలి..
- అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఖమ్మం కలెక్టరేట్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లాలో పారదర్శకంగా జరగాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ బదిలీలకు అవకాశం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, జిల్లా క్యాడర్ పోస్టుల బదిలీ ప్రక్రియ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులలోని నిబంధనల ప్రకారం నాలుగు సంవత్సరాలు ఒకే చోట సర్వీసు పూర్తి చేసిన సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేయాలని, అదే సమయంలో రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 12వ తేదీ వరకు బదిలీల కోసం దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ శాఖ తమ పరిధిలో నాలుగు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసి తప్పనిసరిగా బదిలీ కావాల్సిన ఉద్యోగులు, శాఖ పరిధిలోని ఖాళీల తుది జాబితాను రూపొందించి ఉద్యోగులకు అందుబాటులో పెట్టాలని, రెండు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు అందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు జిల్లాస్థాయి క్యాడర్ పోస్టుల బదిలీ దరఖాస్తులను కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పరిశీలిస్తుందన్నారు. కలెక్టరేట్ ఎదుట బస్ షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. తాగునీటికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలని, ప్లాస్టిక్ బాటిళ్లు వాడకూడదని, స్టీల్ వాటర్ బాటిళ్లు వాడాలని ఆయన తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి నెల నెలా వేతనం అందేలా చూడాలన్నారు. అధికారులు, ఉద్యోగుల హెల్త్ ప్రొఫైల్ కొరకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్వోఎం. రాజేశ్వరి, ఉపాధి కల్పన అధికారి కె. శ్రీరామ్ పాల్గొన్నారు.

మట్టి దందాకు షాక్



పీర్లగుట్టపై విచారణ చేస్తున్న అధికారులు

- అక్రమ మట్టి తవ్వకాలపై లోకాయుక్త విచారణ
- అనుమతిని అతిక్రమించి తవ్వకాలు జరిపినట్టు గుర్తింపు

రఘునాథపాలెం, జూలై 10: ప్రభుత్వ, ప్రజా అవసరాల నిమిత్తం పదెకరాల మేరకు మట్టి తవ్వకాల అనుమతి పొంది అక్రమంగా వందల ఎకరాల గుట్టలను మట్టు పెట్టారు. పదేళ్ల క్రితం కొండలను తలపించిన గుట్టలు ఇప్పుడు మాయమయ్యాయి. దీనిపై కొంతమంది ఆర్‌టీఐ ద్వారా సమాచారం సేకరించి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త రాష్ట్ర బృందం సభ్యులు గతంలో రెండు పర్యాయాలు, బుధవారం మరోసారి పరిశీలించారు. రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి, మంచుకొండ పరిధిలో పీర్లగుట్ట ప్రసిద్ధి. ఐదు మైళ్ల దూరం నుంచి చూసిన పీర్లగుట్ట కనిపిస్తుండేది. పదెకరాలకు మట్టి తోలకాలకు లీజుకు తీసుకున్న వ్యక్తులు... అనుమతి పొందిన సర్వే నెంబర్లను దాటి సుమారు 200 ఎకరాల్లో మట్టి తోలకాలు జరిపారని ఆరోపణలున్నాయి. దీంతో ఇదే ప్రాంతానికి చెందిన వ్యక్తులు లోకాయుక్త, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో విచారణ ప్రారంభమై రెండుళ్లగా కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం లోకాయుక్త రాష్ట్ర ప్రత్యేక అధికారి మ్యాద్యుకోషి ఆధ్వర్యంలో అధికారుల బృందం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని వివరాలను సేకరించారు. తర్వాత పీర్లగుట్టకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. మంచుకొండ, రఘునాథపాలెం, కోయచెలక, పువ్వాడ ఉదయ్‌నగర్ గ్రామాల పరిధిలోని సర్వే నెంబర్‌లోని 361, 362, 363, 364లో వందల ఎకరాల్లో మట్టి తోలకాలు జరిగాయని గుర్తించారు. 200 ఎకరాల్లో 17లక్షల క్యూబిక్ మీటర్ల అక్రమ మట్టి తోలకాలు జరిగి ఉండొచ్చని లోకాయుక్త అధికారులు అంచనాలు వేశారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం వరకు సర్వే జరిగింది.

ఎన్ని ఎకరాలకు అనుమతి ఉంది.. ఎంత మేర తవ్వకాలు జరిపారనే విషయాలను లోకాయక్త అధికారులు ప్రశ్నించగా మైనింగ్ అధికారులు నోరు మెదపలేదు. కనీసం హద్దులు కూడా చూపకపోవటంతో లోకాయుక్త అధికారులు ఆసహనం వ్యక్తం చేశారు. ఒక్క రఘునాథపాలెం మండలంలోనే 280 ఎకరాల్లో అక్రమ మట్టి తోలకాలు జరిగాయని వాటి వివరాలను లోకాయుక్తకు ఫిర్యాదు చేయటం జరిగిందని ఫిర్యాదుదారులు కొయిని వెంకన్న, మందా బచ్చిబాబు తెలిపారు. తహసీల్దార్ లూధర్‌విల్సన్, ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాసరావు, మైనింగ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

'నేషనల్ హైవే' సమస్యలు పరిష్కరించండి..

- జగ్గయ్యపేట-కొత్తగూడెం మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చాలి
- సీఎంకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

4

మాకు టీచర్లు కావాలి..

- మూకుమ్మడిగా రోడ్డెక్కిన విద్యార్థులు
- అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి హైస్కూల్‌లో టీచర్ల కొరత

4

ప్రియుడితో కలిసి..

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని కడతేర్చిన భార్య
- గౌతమ్‌పూర్ వాసి సాహూ ఈశ్వర్ హత్య కేసులో వీడిన మిస్టరీ

4



భద్రాచల రామాలయంలో కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు

రామాలయ అభివృద్ధికి ప్రణాళికలు

- 45 ఇళ్ల నుంచి ఎకరంలోపు స్థలం సేకరణ
- ఇళ్ల యజమానులు సహకరించేందుకు సుముఖత
- రెవెన్యూ, దేవస్థానం అధికారులు, వైదిక బృందంతో కమిషనర్ భేటీ

భద్రాచలం, జూలై 10: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రామాయల అభివృద్ధి చేపట్టేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్న క్రమంలో ఇందుకు సంబంధించి కసరత్తును రాష్ట్ర, జిల్లా అధికారులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తితో కలిసి బుధవారం భద్రాచలం వచ్చారు. రంగనాయకుల గుట్టపై ఉదయం నుంచి రాత్రి వరకు రెవెన్యూ భద్రాద్రి దేవస్థానం అధికారులతో ఆయన భద్రాద్రి రామాలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన ప్రణాళికలపై సమీక్షించారు. ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, దేవస్థానం ఈఈ రవీంద్రనాథ్‌తో పాటు ఆర్కిటెక్ట్ పాల్గొన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా భద్రాద్రికి వచ్చిన సమయంలో రేవంత్‌రెడ్డి భద్రాద్రి ఆలయ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆలయ రూపురేఖలను ఏ విధంగా తీర్చిదిద్దాలో ఇప్పటికే ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి పలు నమూనాలను వేసినట్లు తెలుస్తోంది.

కాగా రామాలయ అభివృద్ధిని చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో ఆలయ పరిసరల్లో 45 ఇళ్ల నుంచి ఎకరంలోపు స్థలం సేకరించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇళ్లు కోల్పోయే అవకాశం ఉన్న వారితో కమిషనర్ హనుమంతరావు మాట్లాడారు. కొంత మంది ఇళ్లు కోల్పోయే అవకాశం ఉందని భావిస్తున్న వారు కమిషనర్‌ను కలవడంతో భద్రాద్రి అభివృద్ధికి స్థానికులుగా సహకరించాలని ఆయన కోరినట్లు తెలిసింది. తమకు సముచితమైన పరిహారం అందిస్తే భూములను అప్పగించేందుకు సిద్ధమని పేర్కొన్నట్లు తెలుస్తోంది. కాగా సమావేశం అనంతరం బుధవారం రాత్రి భద్రాద్రి రామాలయాన్ని కమిషనర్ హనుమంతరావు అదనపు కలెక్టరు వేణుగోపాల్, ఆర్డీవో దామోదర్‌రావు, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి దర్శించుకున్నారు. దేవస్థానం తరపున శాలువ, జ్ఞాపిక స్వామి వారి ప్రసాదాన్ని ఈవో రమాదేవి అందజేశారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు

వివాహితను ట్రాప్ చేసిన ఘటనలో పోలీసుల చర్య

ఖమ్మం క్రైం, జూలై 10: వివాహితతో సన్నిహితంగా ఉంటూ ఆమె భర్తపై దాడిచేసి చంపుతానని బెదిరించిన ఏఆర్ కానిస్టేబుల్ తాటి రాంబాబుపై ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని బాంబు డిస్పోజల్ విభాగంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాంబాబు నగర శివారు ప్రాంతానికి చెందిన ఓ వివాహితతో కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తనను చంపేందుకు ప్రయత్నించారని సదరు వివాహిత భర్త నాగేందర్‌బాబు ఖమ్మం సీపీ సునీల్‌దత్‌కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో విచారణ చేపట్టిన ఖమ్మం అర్బన్ పోలీసులు బాధిత వ్యక్తిని బుధవారం స్టేషన్‌కు పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ విషయంపై అర్బన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ రాంబాబు తనను కొట్టి, బూతులు తిట్టి చంపుతానని బెదిరించాడని, అతడి నుంచి తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని వేడుకున్నాడు. దీంతో పోలీసులు కానిస్టేబుల్ రాంబాబుపై 294బి, 323, 506 రెడ్‌విత్ 34 కింద కేసులు నమోదు చేశారు. ఇదిలావుండగా, పోలీసుశాఖకు మచ్చతెచ్చేలా వ్యవహరించిన కానిస్టేబుల్ రాంబాబును సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

22నుంచి గ్రూప్ 1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

● 19 వరకు దరఖాస్తులకు సమయం: కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 10: టీజీ బీసీ స్టడీసర్కిల్ ఖమ్మం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 75 రోజులపాటు టీజీపీఎస్సీ గ్రూప్1(మెయిన్స్)కు అర్హత సాధించిన వారిలో 150 మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కోచింగ్ సమయంలో ప్రతి అభ్యర్థికి రూ.5వేల స్టైఫండ్ (బుక్ ఫండ్, రవాణాతో కలిపి) అందజేస్తామన్నారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తులను www.tgbcstudycircle.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈ నెల 11 నుంచి 19 వరకు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ శ్రీలత తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, రూల్ ఆప్ రిజర్వేషన్‌ప్రకారం ఎంపికలు ఉటాయని తెలిపారు.

కొనసాగుతున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 10: ఖమ్మం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఐదు రోజులుగా కొనసాగుతున్న ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో బుధవారం మొత్తం 800 మంది విద్యార్థులు స్లాట్ బుకింగ్ చేసుకోగా 780 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విజయవాడ ప్రాంతాల నుంచి విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హజరయ్యారని కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు ఈ మెదటి దశ కౌన్సెలింగ్ 13 వరకు కొనసాగుతుందని తెలిపారు.

దోస్త్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి

డిగ్రీ కళాశాలలో మూడు ఫేజుల్లో దోస్తు ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు తప్పని సరిగా హజరుకావాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. శుక్రవారం వరకు విద్యార్థులు హజరుకావా లని తెలిపారు. గైర్హాజరైన విద్యార్థులు సీట్లు కోల్పోతారని తెలిపారు.

విద్యుత్ లైన్ టెక్నికల్ ఛార్జింగ్ ప్రారంభం

ముదిగొండ, జూలై 10: ముదిగొండ మండలం పమ్మి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కమలాపురం వెళ్లే 33/11కేవీ విద్యుత్ లైన్ టెక్నికల్ ఛార్జింగ్‌ను టీజీఎన్‌పీడీసీఎల్ ప్రాజెక్టు వరంగల్ సీజీఎం రాజాచౌహాన్ బుధవారం ప్రారంభించారు. పమ్మి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కమలాపురం సబ్‌స్టేషన్ వరకు 4.9కిలోమీటర్ల వరకు 33/11కేవీ విద్యుత్‌లైన్ నిర్మాణం పూర్తికావడంతో సీజీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈలు హీరాలాల్, భద్రుపవార్, నాగేశ్వరరావు, ఏడీఈలు కిరణ్‌చక్రవర్తి, భీమ్‌సింగ్, ఏఈలు ప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

భారీ వర్షానికి కాలువలకు గండ్లు

» 10వేల ఎకరాలకు పైగా నీటమునిగిన పంటలు
» యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిన అధికారులు
» పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్, జూలై 10: మంగళవారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాలలో సుమారు 10వేల ఎకరాలకు పైగా వరిమడులు నీటమునిగాయి. బేతుపల్లి పెద్ద చెరువు తూర్పు కాలువతో పాటు తుంబూరులో నల్లకాలువకు గండి పడినట్లు ఐబీ అధికారులు తెలిపారు. బుధవారం గండ్లు పడిన ప్రాంతాలను ఐబీ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ వెంకటేశ్వర్లు, పీవీకే. ప్రసాద్ పరిశీలించి తక్షణమే యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టారు. నల్లకాలువ వద్ద గండి పడటంతో ఎన్‌హెచ్ అధికారుల సహాయంతో పూడ్చినట్లు తెలిపారు. మిగతా ప్రాంతాలలో సైతం మరమ్మతులు చేపట్టి వరద నిలవకుండ చూస్తామని, అవసరమై ప్రాంతాలలో తూములు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. మేట వేసిన పంటపొలాలను బాగుచేసి రైతులకు అందుబాటు లోకి తీసుకురావాలని నేషనల్ హైవే కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు.

గండ్లు పడిన పంటకాలువలు

మండలంలోని రామగోవిందాపురం గుట్ట, చింతంపల్లి ప్రాంతం నుంచి వరద సత్యనారాయణపురం మీదుగా పెద్ద పాకలగూడెం, బేతుపల్లి, నారాయణపురంల మీదుగా వరద భారీగా చేరింది. దీంతో నల్లకాలువకు 20మీటర్ల మేర, ఎర్రకాలువకు మూడు ప్రాంతాల్లో గండ్లు పడినట్లు ఐబీ అధికారులు చెబుతున్నారు. దీంతో సుమారు 10వేల ఎకరాలకు పైగా వరిమడులలో వరద నీరు నిలవడంతో పాటు ఇసుక మేట వేసినట్లు రైతులు చెబుతున్నారు. ఆయా గ్రామాలలో వరదనీటి కారణంగా పొలాల కు వెళ్లే దారులతోపాటు రహదారి వెంబడి రోడ్డు దెబ్బతింది.

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే రాగమయి

వరద ముంపునకు గురైన పంటపొలాలు, గండ్లు పడిన కాలువల ను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బుధవారం పరిశీలించారు. తక్షణమే రక్షణ చర్యలతో పాటు పంట నష్టం అంచనా వేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. నష్టం వివరాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఎమ్మెల్యే ఫోన్ ద్వారా వివరించారు.





పంటపొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి, రైతులతో మాట్లాడుతున్న నీటిపారుదలశాఖ అధికారులు, నల్లకాలువ వద్ద జరుగుతున్న మరమ్మతులు

కల్లూరులో విజృంభిస్తున్న విష జ్వరాలు

» ఎక్కువగా టైఫాయిడ్ కేసులు నమోదు
» గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం
» కలుషిత తాగునీరు

కల్లూరు, జూలై 10: వర్షకాల సీజన్ ప్రారంభమైనందున కల్లూరు మండల పరిధిలో గల పలు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు లోపించటమే కాకుండ, కలుషిత తాగునీటి కారణంగా సీజనల్ జ్వరలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు సగటున 30 వరకు జ్వరాల బారిన పడిన వారు చికిత్స పొందుతుండగా అదే క్రమంలో పలు ప్రైవేట్ ఆసుపత్రులలో కూడా మరో 30 మంది వరకు జ్వరాలతో ఇబ్బందులు పడుతు వైద్య చికిత్సలు పొందుతున్నారని తెలిసింది. గ్రామ పంచాయతీల్లో నిధుల కోరత కారణంగా పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టక పోవడవం, మరో వైపున భగీరథ నీరు కలుషితంగా సరఫరా కావంటం, దీనికి తోడు గత కొద్ది రోజుల క్రితం నుంచి అడప దడపగా వర్షాలు కురవటంతో పలు గ్రామాల్లో వైరల్ ఫీవర్లు విస్తరిస్తున్నాయి. ప్రధానంగా టైఫాయిడ్ జ్వరాల బారిన పడి ఎక్కువ మంది ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపున ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించటంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం లేనందున పారిశుధ్యం లోపించి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్నాయి. మూడు సంత్సరాల క్రితం కల్లూరులో పారిశుధ్యం లోపించి ఎంతో మంది విష జ్వరాలు, డెంగ్యూ బారిన పడి మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయి.




కల్లూరులో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సీజన్ ప్రారంభం కావటంతో కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు విజృంబిస్తున్నాయి. ఈ పరిస్థితి దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా వైద్యాశాఖ వారు కూడా క్షేత్ర స్థాయిలో జ్వరాలు నియంత్రణకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ నిరుపేదలకు వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉంది. పంచాయతీరాజ్, వైద్యశాఖ, ఐసీడీఎస్ శాఖల వారు సమన్వయంతో వ్యవహరించి సీజనల్ వ్యాధులబారిన పడిన వారిని గుర్తించి వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం: డాక్టర్ నవ్యకాంత్, వైద్యాధికారి

గ్రామాలలో జ్వరాల బారిన పడిన వారిని గుర్తించి ఇప్పటికే వైద్యశాఖ తరుపున వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రధానంగా గ్రామాలలో పారిశుధ్యం లోపించటం, కలుషిత నీరు కారణగా జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడపోసిన నీటిని త్రాగాలని ఆయన ప్రజలకు సూచించారు. జ్వరాల బారిన పడిన వారు ఆసుపత్రికి వస్తే వెంటనే వైద్య చికిత్స అందిస్తామని అన్నారు. గత కొద్ది రోజులు నుంచి ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు.



మాట నిలబెట్టుకున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

» పెద్దవాగు బ్రిడ్జి, రహదారి మరమ్మతులకు రూ, 9.80లక్షలు మంజూరు
» పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్

కరకగూడెం, జూలై 10: మండల కేంద్రంలోని పెద్దవాగు బ్రిడ్జిని ఇటీవల పరిశీలించిన కలెక్టర్ త్వరలోనే బ్రిడ్జి, రహదారి మరమ్మతులు చేపడతామని ఇచ్చిన మాటను కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిలబెట్టుకున్నారు. జూన్‌లో పెద్దవాగు ప్రవాహంతో పొంచి ఉన్న ప్రమాదం అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించడంతో స్పందించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇటీవల అధికారులతో కలిసి పెద్దవాగు బ్రిడ్జిని కుంగిన రోడ్డును పరిశీలించారు. ఆయన త్వరలోనే బ్రిడ్జి, రహదారి మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కలెక్టర్ తన నిధుల నుంచి రూ.9 లక్షల 80వేలు మంజూరు చేశారు. బ్రిడ్జి, రహదారి మరమ్మత్తులను ఇరిగేషన్ శాఖ అప్పగించారు. బుధవారం బ్రిడ్జి, రహదారి మరమ్మతులను ఇరిగేషన్ ఏఈ సక్రు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి కింద పూడిన ఇసుకను, బ్రిడ్జికి అడ్డుపడిన చెట్లను తొలగించుటకు రూ.5లక్షలు, రహదారి రివిట్ మెంట్‌కు రూ.4.80లక్షలు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పనులు ప్రారంభించడంపై చిరుమళ్ళ, రాయణపేట, పోలకమ్మతోగు, చందావారి గుంపు, వట్టంవారిగుంపు, కౌలురు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




బ్రిడ్జి వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం, ఇటీవల బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

» ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య » నలుగురు నిందితులను అరెస్టు చేసిన కొత్తగూడెం పోలీసులు

చుంచుపల్లి, జూలై 10: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ఓ మహిళ ప్రియుడితో కలిసి తన భర్తను కడతేర్చిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. ఈ ఘటనలో నిందితురాలైన భార్యతో పాటు ఆమెకు సహకరించిన మరో ఇద్దరిని కొత్తగూడెం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఈ సంఘటనకు సంబంధించి తెలిపిన వివరాలను వెల్లడించారు. చుంచుపల్లి మండలంలోని గౌతమ్‌పూర్ గ్రామ పంచాయతీకి చెందిన సాహూఈశ్వర్, రెహానా 15ఏళ్ల క్రితం మతాంతర వివాహం చేసుకున్నారు. అదే ప్రాంతంలో సింగరేణి క్వార్టర్ టి 2-29సిలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో అదే ప్రాంతంలో మరో క్వార్టర్‌లో నివాసముంటున్న ఆటో డ్రైవర్ అరిక రమేష్‌తో రెహానాకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త సాహూ ఈశ్వర్ తన భార్యను మందలించాడు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇలాంటి తప్పుడు పనులు చేయొద్దని రెహానాకు నచ్చ చెప్పాడు. ఆటో డ్రైవర్ రమేష్ చేస్తున్న తపుని గతంలో ఆటో యూనియన్ పెద్దల దృష్టికి తీసుకెళ్లగా వారు అతడిని మందలించారు. కానీ రమేష్ వక్రబుద్ధి మారకపోగా వివాహేతర సంబంధానికి సాహూ ఈశ్వర్ అడ్డు పడుతున్నాడని, అందువల్ల అతడిని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయాలని భార్య రెహానా పథకం వేసింది. ఆ తరువాత అనేకసార్లు రెక్కీ నిర్వహించారు. కాలనీలో జన సంచారం తక్కువగా ఉండే సమయం చూసుకొని హత్యకు పథకం వేశారు. అందులో భాగంగా రమేష్ ఈ నెల 6న రెహానా ద్వారా ఈశ్వర్ ఇంట్లో ఉన్నట్లు తెలుసుకొని తన అల్లుడు చందుతో కలిసి ఇంట్లో ఉన్న ఈశ్వర్‌పై విచక్షణారహితంగా కత్తులతో దాడి చేశారు. ఈశ్వర్ వీపు, ఛాతి, పొట్టలో కత్తితో పొడిచారు. తీవ్రంగా గాయపడ్డ ఈశ్వర్‌ని స్థానికులు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 7వ తేదీన మృతి చెందాడు. మృతుడు ఈశ్వర్ తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈ కేసుతో సంబంధం ఉన్న సాహూ ఈశ్వర్ భార్య రెహానా, అరిక రమేష్, అతడి అల్లుడు చందు, రమేష్ భార్య ఇందిరలను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన టూటౌన్ ఎస్‌హెచ్‌వో తొగటి రమేష్ కుమార్‌ను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్ఐ ఎస్తేరు రాణి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది లాల్‌సింగ్, పీసీ రాములు, ఈర్ల రమేష్ పాల్గొన్నారు



వివరాలు వెల్లడిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

మాకు టీచర్లు కావాలి..

» ఉపాధ్యాయుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు » అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి హైస్కూల్‌లో టీచర్ల కొరత » 135 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు
» గ్రామంలో రెండు గంటల పాటు విద్యార్థుల ఆందోళన » డీఈవో హామీతో ఆందోళన విరమణ

అశ్వారావుపేట రూరల్, జూలై 10: తమ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరని, వెంటనే తమకు ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లిలో విద్యార్థులు రోడ్డెక్కారు. తమ ఉన్నత పాఠశాలలో 135మంది పైగా విద్యార్థులుండగా మొత్తం ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉండగా ఇద్దరే న్నారని, సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులే లేరని, పాఠశాలకు వచ్చి ఖాళీగా కూర్చుంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉపాధ్యాయులను కేటాయించి బోధన సక్రమంగా సాగేలా చూడాలని సుమారు రెండు గంటల పాటు ఆందోళన నిర్వహించారు.

అశ్వారావుపేట మండలంలో పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించే ఉన్నత పాఠశాలల్లో గుమ్మడివల్లి పాఠశాల ఒకటి. ప్రస్తుతం ఈ స్కూల్‌లో 6వతరగతి నుంచి 10వ తరగతి వరకు 135మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 8 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ఈ సంవత్సరం పాఠశాల ఆరంభంలో ఇక్కడ ఏడుగురు ఉపాధ్యాయులు పనిచేశారు. అయితే తాజాగా జరిగిన ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులు ఇతర పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ పాఠశాలకు మాత్రం ఇదే మండలంలోని రెండు పాఠశాలల నుంచి గణితం, ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు మాత్రమే వచ్చారు. దీంతో మరో ఆరుగురు ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది.

సాధారణంగా ఉన్నత పాఠశాల అంటే అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ఇక్కడ ఉన్నది ఇద్దరే కావటంతో బోధన పూర్తిగా కుంటుపడింది. రెండు మూడు తరగతుల విద్యార్థులను ఒకే చోట కూర్చోబెట్టి బోధన చేయాల్సి వస్తోంది. పదో తరగతి బోధన ఒకరు చేస్తుంటే మిగతా నాలుగు తరగతులను ఒకరు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు ప్రధానోపాధ్యాయుడికి సమావేశాలు, రికార్డుల నిర్వాహణ బాధ్యతలు ఎక్కువగా ఉండడంతో బోధన అంతంతమాత్రంగానే ఉంటుంది. విద్యార్థులు స్కూలుకు వచ్చినా ఖాళీగానే కూర్చోవాల్సిన పరిస్థితి ఉంది. చదువులు సాగకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



పాఠశాలకు తాళం వేస్తున్న తల్లిదండ్రులు

రెండు గంటల పాటు ఆందోళన

తమకు ఉపాధ్యాయులు కావాలంటూ బుధవారం ఉదయం పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారు. తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాలకు తాళాలు వేసి చిన్నారులతో కలిసి వేలేరుపాడు వెళ్లే మార్గంలో రోడ్డుపై బైఠాయించారు. ఫిజిక్స్, సోషల్, తెలుగు హిందీ, ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులు లేక ఇబ్బంది పడుతున్నామని ప్లకార్డులు ధరించి రోడ్డుపై ఆందోళనకు దిగారు. పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించి తమ భవిష్యత్‌ను కాపాడాలని వేడుకున్నారు. సుమారు రెండు గంటల పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న సీఆర్‌పీ రామారావు విద్యార్థుల వద్దకు చేరుకొని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారితో మాట్లాడించారు. మూడు రోజుల్లో ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపి బోధన సక్రమంగా సాగేలా చూస్తానని హామీ ఇచ్చారు. డీఈవో హామీతో విద్యార్థులు, గ్రామస్థులు ఆందోళన విరమించారు.

15 పాఠశాలల పర్యవేక్షణ..

గుమ్మడివల్లి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌గా ఉంది. ఈ పాఠశాల పరిధిలో 15 పాఠశాలను ఇదే పాఠశాల హెచ్ఎం పర్యవేక్షణ చేయాలి. ఉన్న ఇద్దరు టీచర్లలో ఒకరు హెచ్ఎంగా బాధ్యతలను చూస్తునే బోధన చేయాల్సి ఉంది. దీనికి తోడు నెలలో సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు సగం కాలం పోతుండగా బోధన కుంటుపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో గుమ్మడివల్లి పాఠశాలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తమ భవితను కాపాడాలంటూ ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న చిన్నారులు

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పేరుతో ఘరానా మోసం..

పాల్వంచ, జూలై 10: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పేరుతో ఓ మహిళను బెదిరించి ఆమె నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత పాల్వంచకు చెందిన షేక్ వహీదున్నీసాకు సోమవారం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆమె పై మనీలాండరింగ్ కేసు నమోదయ్యిందని బెదిరించారు. అనంతరం తాము ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఆమెను బెదిరించి ఆమె అకౌంట్ నుంచి వారిచ్చిన అకౌంట్‌కు రూ.4 లక్షలు ఆర్‌టీజీఎస్ చేయించుకున్నారు. నగదు బదిలీ చేస్తే కేసు లేకుండా చేస్తామని చెప్పడంతో ఆమె నగదు బదిలీ చేసింది. తరువాత వారి సెల్ స్విచ్ ఆప్ రావడంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు సమాచారం అందించి వారి సూచన మేరకు పాల్వంచ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ రాము తెలిపారు.

కనీస వేతనాలు చెల్లించాలని కార్మికుల ధర్నా



కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఖమ్మంకార్పొరేషన్, జూలై 10: ఖమ్మం నగరపాలకసంస్థలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సిం గ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించి వెంటనే అమలు చేయాలని, కార్మికు లకు రక్షణ పరికరాలు అందచేయాలని, నగరపాలకసంస్థలో అక్రమ ప్రమోషన్లు నిలిపివేయా లని డిమాండ్ చేస్తూ తెలంగాణా మున్సిపల్ వర్కర్స్&ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం నగరపాలకసంస్థ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మా విష్ణువర్ధన్, కళ్యాణం వేంకటేశ్వరరావు మాట్లాడుతూ పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు రూ.21వేలు వేతనం ఇస్తుండగా, ఇక్కడ మాత్రం కేవలం రూ.15,600 ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వేతనాల విషయంలో మోసం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరపాలకసంస్థలో జవాన్ల ప్రమోషన్లు అక్రమ పద్ధతిలో ఇస్తున్నారని, సీనియారిటీ, విద్యార్హతల ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వకుండా, వారినే కొనుక్కోవాలని జవాన్లు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఖమ్మం నగరంలోని డంపింగ్‌యార్డుకు దారిలేక పోవటంతో చెత్త డంపింగ్ చేసే వాహనాల వెళ్లక, డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌కు అందజేశారు. యూనియన్ నాయకులు జినకల శ్రీను, నాయకులు దొడ్డా నర్సింహారావు, వెంకటరమణ, పద్మ, విజయ, జల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ షీట్లు చోరీ

ఖమ్మంక్రైం, జూలై10: సెంట్రింగ్ షీట్లు దొంగిలించి తీసుకెళ్లిన వారిని స్థానికులు పోలీసులకు అప్పగించిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బల్లేపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంటికి సెంట్రిగ్ షీట్లు ఏర్పాటు చేసి, కొన్ని షీట్లు పక్కన పెట్టారు. మంగళవారం అర్ధరాత్రి వాటిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయగా, బుధవారం షీట్లు పోయినట్టుగా బాధితులు గుర్తించారు. కాగా దొంగలు సెంట్రింగ్ యూనియన్‌లోని ఒకరికి ఫోన్ చేసి షీట్లున్నాయి, వాటిని తక్కువ రేటుకు ఇస్తామని చెప్పడంతో అనుమానం వచ్చి బాధితులు బల్లేపల్లిలోని దొంగిలించిన వారి ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ దొంగిలిచిన షీట్లు ఆటోలో ఎక్కిస్తుండగా, వారిని పట్టుకుని అర్బన్ పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు

జూలూరుపాడు, జూలై 10: ద్వి చక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన భార్యభర్తలు పగిడిపల్లి పద్మ, నగేష్‌లు కలసి ద్విచక్ర వాహనంపై జూలూరుపాడు మండలంలోని సూరారం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళుతున్నారు. వెంగన్నపాలెంలోని సాయిబాబా ఆలయం నుంచి సూరారం రహదారి వైపు వెళుతున్న క్రమంలో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్వి చక్ర వాహనంపై ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సహాయంతో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని క్షతగాత్రుల వివరాలను నమోదు చేసుకున్నారు.

నేషనల్ హైవే సమస్యలు పరిష్కరించండి..

» జగ్గయ్యపేట-కొత్తగూడెం మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చాలి » వీడియో కాన్ఫరెన్సులో సీఎంకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

ఖమ్మం, జూలై 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ రహదారులపై బుధవారం ముఖ్యమంత్రితో పాటు నేషనల్ హైవే అధికారులతో కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో వ్యవసా యశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని పలు జాతీయ రహదారుల గురించి విజ్ఞప్తి చేశారు. సత్వరం పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం వరకు వయా బోనకల్ వైరా, తల్లాడ మీదుగా రెండు రాష్ట్రాలను అనుసంధానం చేసే రాష్ట్రీయ రహదారిని జాతీయ రహదారిగా మంజూరు చేయాలని, భువనగిరి నుంచి కొత్తగూడెం వయా వలిగొండ, తొర్రూరు, మహబూబాబాద్ వరకు మంజూరైన జాతీయ రహదారికి తొర్రూరు వరకే టెండర్ అయి పని సాగుతోందని తొర్రూరు నుంచి కొత్తగూడెం వరకు టెండరు పిలిచి పనులు ప్రారంభింపచేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఖమ్మం నుంచి అశ్వారావుపేట వెళ్లే జాతీయ రహదారికి మరమ్మతులు లేక వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ రహదారిని అవసరమైతే నేషనల్ హైవే నుంచి తెలంగాణకు బదలాయించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఖమ్మం ధంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఎంట్రీ, ఎగ్జిట్ త్వరగా మంజూరు చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, నాగపూర్-అమరావతి హైవే భూసేకరణ సమస్యలు పరిష్కరించి, నెల రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు.



వీసీలో పాల్గొన్న మంత్రి తుమ్మల, అధికారులు

పనులు ఆగిన చోట భూములు కోల్పోతున్న వారితో చర్చించి, పనుల పూర్తికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంకా జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, నేషనల్ హైవే పీడీ దుర్గాప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మీనన్ తదితరులు పాల్గొన్నారు.

అందరి అభీష్టం మేరకే 'రైతు భరోసా'

(3వ పేజీ తరువాయి)

అనుగుణంగానే రైతుభరోసా అమలు ఉంటుందన్నారు. అలాగే సర్వే నెంబర్ ఆధారంగా సాగుచేస్తున్న పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి పంటకు ప్రకృతి వైపరీత్యాలతో ఏ నష్టం జరిగినా పరిహారం అందించేలా బీమా విధానం అమల్లోకి తీసుకురాబోతున్నట్లు మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా చెల్లింపుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నామని తెలిపారు. సాగుచేసే రైతులను తమ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వం ఖర్చుపెట్టే ప్రతి రూపాయి రాష్ట్ర ప్రజలదేనన్నారు. వారు వివిధ రూపాల్లో చెల్లించిన పన్నులను జాగ్రత్తగా తిరిగి వారికే పంపిణీ చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వంలో చేసినట్లు నాలుగు గోడల మధ్య నిర్ణయాలు తీసుకోద్దనే వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా పథకాన్ని అమలు చేయబోతున్నామన్నారు.

ఈ వర్క్‌షాప్‌లో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్‌నాయక్, తెల్లం వెంకటరావు, రాష్ట్రగిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, రెండు జిల్లాల వ్యవసాయాధికారులు విజయనిర్మల, బాబురావు తదితరులున్నారు.



సదస్సుకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు

భూసమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే రాందాస్

● రైతుకు వ్యవసాయ భూమిని తిరిగి అప్పగించేందుకు అంగీకరించిన ఆర్టీఐ మాజీ కమిషనర్

కారేపల్లి, జూలై10: మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని హల్యాతండావద్ద నెలకొన్న భూసమస్యను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ చొరవతో పరిష్కారం అయింది. తండా సమీపంలోని పచ్చిపాల భద్రయ్యకు చెందిన 1ఎకరం20కుంటల భూమిని టీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ఆర్టీఐ కమిషనర్‌గా వ్యవహరించిన మాజీ అధికారి కబ్జాకు పాల్పడ్డాడని సంబంధిత రైతు కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ, పలుమార్లు ఆందోళనకు దిగారు. అయితే ఇదే విషయం భద్రాచలం ఐటీడీఏ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం మాజీ కమిషనర్ భార్య కొంతమందిని వెంటపెట్టుకోని వచ్చి భద్రయ్య భూమిలో దుక్కిదున్నేందుకు వచ్చారు. ఆసమయంలో భద్రయ్య అతడి కుటుంబ సభ్యులు అడ్డుకునేందకు ప్రయత్నం చేశారు. దీంతో భద్రయ్య కుటుంబ సభ్యులను వారు అడ్డుకోవడంతో మనస్తాపానికి గురైన అతడు అక్కడే క్రిమిసంహారక మందు తాగాడు. ఇది గమనించిన అతని కుటుంబ సభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. భద్రయ్య ఆరోగ్యపరిస్థితి విషయంగా ఉందనే సమాచారం. విషయం తెలిసుకున్న ఎమ్మెల్యే



భద్రయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

రాందాస్‌నాయక్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే నివాసంలో ఇరువర్గాలకు చెందిన వారిని పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరించారు. తన వద్ద ఉన్న భద్రయ్య భూమిని తిరిగి ఇచ్చేందుకు మాజీ అధికారి అంగీకరించడంతో పాటు, పరస్పరం పెట్టుకున్న కేసులను తిరిగి వెనక్కి తీసుకునేందుకు ముందకు వచ్చారు. ఎమ్మెల్యే చేసిన కృషిని పలువురు అబినందించారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి జైలు

కొత్తగూడెం లీగల్, జూలై10: గంజాయి అక్రమ రవాణా కేసులు ఇద్దరికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ (ఫుల్ అడిషనల్ చార్జ్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి స్పెషల్ జడ్జి ఫర్ ఎన్‌డీపీఎస్) ఇద్దరికి 12 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. భద్రాచలానికి చెందిన తాడి శివశంకర్ ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మల్కాన్‌గిరి జిల్లా బావనపల్లికి చెందిన అజగర్‌ఖాన్ ఏలియా సంతోష్‌లు 2023 జూన్ 16న సీఆర్పీ క్యాంపు కోనవరం రోడ్డు భద్రాచలంలో మారుతి ఈకో వ్యాన్‌లో గంజాయి రవాణా చేస్తుండగా, అప్పటి భద్రాచలం టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీకాంత్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 484 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోగా, వాటి విలువ రూ.96,80,000 ఉంటుందని తెలిపారు. వారిపై భద్రాచలం సీసీఎస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. నాగరాజు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. ఒడిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన త్రినాథ్, పాపారావు, అలియాస్ పప్పు సింగ్, తాతారావు, అలియాస్ రాజు, మడకం రాము, బాబీ, ఢిల్లీకి చెందిన నంద, అభయ్ అనే వ్యక్తుల అచూకీ లభించలేదని వారిపైన సప్లమెంటరీ ఛార్జీషిట్ వేస్తామని పోలీసులు కోర్టుకు వివరించారు. వాదనల అనంతరం తాడికొండ శివశంకర్, అజగర్‌ఖాన్ అలియాస్ సంతోష్‌లపై నేరం రుజువుకాగా ఇద్దరికి 12 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధి స్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయ్‌కుమార్ నిర్వహించగా, లైజాన్ ఆఫీసర్ ఎం. హరిగోపాల్ కోర్టు డ్యూటీ ఆఫీసర్ భద్రాచలం పీసీ సుందర్‌బాబులు సహకరించారు.

ఆర్థిక సహాయం అందజేత

కల్లూరు, జూలై 10: మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో బుధవారం అమెరికాలో మృతి చెందిన శ్రీనాథ రాజు కిరణ్ కుటుంబానికి స్థానిక ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఈవూరి నరిసింహారావు, ఆ సంఘం నాయకులు కుమ్మరి రామారావు చేతుల మీదుగా రూ. 51వేల నగదు చెక్కును అందజేశారు. అదే విధంగా గ్రామస్థులు కూడా ముందుకు వచ్చి తమ వంతుగా మరో రూ.30 వేలకు పైగా నగదును అందించారు. కిరణ్ కుటుంబానికి ఆర్థికంగా చేయూత నిచ్చే క్రమంలో పై విధంగా ఆ గ్రామంలో విశ్రాంత ఏఎస్ఐ, పూర్వ విద్యార్థి కుమ్మరి రామారావు ఆధ్వర్యంలో కిరణ్ కుటుంబానికి ఆర్థిక వితరణ అందేలా ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు



కిరణ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న చిన్నకోరుకొండి పాఠశాల పూర్వ విద్యార్థులు

వడ్లమూడి రామకృష్ణ, కుమ్మరి రామారావు, వడ్లమూడి కృష్ణమూర్తి, చలమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

● బిల్లుపాడులో ఘటన

తల్లాడ, జూలై 10: భూవివాదంలో పోలీసులు ఇంటికి రావడంతో ఆందోళనకు గురైన మహిళ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మండలం బిల్లుపాడు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. బిల్లుపాడు గ్రామానికి చెందిన రైతు ఇంజం కృష్ణార్జున్, కలకొడిమ గ్రామానికి చెందిన కొమ్మినేని వెంకటనారాయణకు మధ్య కొంతకాలంగా భూ వివాదం ఉంది. ఈ క్రమంలో భూ వివాదమై ఇరువర్గాల వారు గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. బుధవారం విచారణలో భాగంగా కృష్ణార్జున్ ఇంటికి పోలీసులు వచ్చారు. కాగా కృష్ణార్జున్ ఇంట్లో లేకపోవడంతో అతడి భార్య విజయలక్ష్మిని పోలీస్‌స్టేషన్‌కు రావాలని కానిస్టేబుళ్ల అనడంతో, ఆందోళన చెందిన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే వైరాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

ఈ విషయమై తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావును వివరణ కోరగా.. ఈనెల 2వ తేదీన ఇంజం కృష్ణార్జున్‌రావు, కొమ్మినేని వెంకటనారాయణ మధ్య భూవివాదం జరగడంతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారని తెలిపారు. ఈ భూమికి సంబంధించి కొమ్మినేని వెంకటనారాయణ వద్ద పట్టాదారు పాస్‌పుస్తకంతోపాటు పూర్తి ఆధారాలను తమ విచారణలో చూపించినట్లు ఎస్ఐ తెలిపారు. కృష్ణార్జున్‌రావును పొలానికి సంబంధించి ఆధారాలు తీసుకురావాలని చెప్పినప్పటికీ కనీసం స్పందించడం లేదన్నారు. భూమికి సంబంధించిన ఆధారాలు తీసుకురావాలని చెప్పేందుకే అతడి ఇంటికి కానిస్టేబుళ్లను పంపినట్లు ఎస్ఐ వివరించారు.

ద్విచక్రవాహనం చోరీ

ఖమ్మంక్రైం, జూలై10: ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సం ఘటన బుధవారం నగరంలో జరిగింది. నగరంలోని వీడియోస్‌కాలనీకి చెందిన చావా కొండలరావు తన వ్యక్తిగత పనిపై వైరా రోడ్డులోని ఓబ్యాంకులోకి వెళ్లాడు. పని ముగించిన బయటకు రాగా తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల వెతికిన కనబడకపోవడంతో, చోరీకి గురైనట్లు గుర్తించి టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆద్యంతం ఉత్సాహంగా...

(3వ పేజీ తరువాయి)

చెప్పడంతో ఆసక్తిగా వాటిని ఉప ముఖ్యమంత్రి నోట్ చేసుకున్నారు. బొంతు రాంబాబు అనే మరో రైతుసంఘం నాయకుడు మాట్లాడినప్పుడు కూడా అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని సూచించడంతో భట్టి విక్రమార్క అంటే మీ ఉద్దేశ్యంలో రైతు భరోసాను రద్దు చేసి బోనస్సే ఇవ్వాలా అంటూ ప్రశ్నించారు.

ఇల్లెందు పీఏసీఎస్ అధ్యక్షుడు మొట్ల కృష్ణ ఏజెన్సీ ప్రాంతంలో భూములు ఉన్నప్పటికీ వాటికి హక్కులు లేవని చెప్పడంతో వాస్తవమే ఈ సమస్యను పరిశీలిస్తాం అంటూ మంత్రి తుమ్మల అన్నారు. సీపీఐ జిల్లా అధ్యక్షుడు బాగం హేమంతరావు పంటల బీమా పథకాన్ని అమలుచేయాలని కోరడంతో రాష్ట్ర వ్యాప్తంగా మరో మారు రైతులను సమావేశం నిర్వహించి దీనిపై కూడా నిర్ణయాన్ని తీసుకుంటామని మంత్రి తుమ్మల చెప్పారు.

మరో మహిళా రైతు మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతులకే భరోసా ఇవ్వాలని లేకుంటే వారికి ఇవ్వోద్దని చెప్పడంతో సభలో మంత్రి తుమ్మల బాగా చెప్పారమ్మా చప్పట్లు కొట్టాలంటూ రైతులతో కొట్టించారు. ఇలా రైతులు తమ తమ అభిప్రాయాలు వెల్లడించడంతో చివరిగా మీ అభిప్రాయాల మేరకు అసెంబ్లీలో చర్చించి తగిన నిర్ణయాన్ని తీసుకుని సత్వరమే రైతులకు ఈ పథకాన్ని వర్తింప చేస్తామని చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ముదిగొండ, జూలై 10: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ముదిగొండ మండలం కట్టకూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కట్టకూరు గ్రామానికి చెందిన పాకనాటి పిచ్చిరెడ్డి(36)సూర్యాపేట జిల్లా కోదాడలో సంవత్సరకాలంగా ఒక హోటల్ నడుపుతూ జీవిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్నాడు. గత సోమవారం వ్యాపార పనుల నిమిత్తం బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. బుధవారం కట్టకూరు గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటుగా వెళ్లిన కొందరు రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు కొరివి వీరారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఖమ్మం రూరల్, జూలై 10: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, తీర్థాల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేలకొండపల్లి మండలం, బైరవునిపల్లి గ్రామానికి చెందిన లింగనబోయిన యల్లమ్మ తన భర్త గొడవల కారణంగా గత ఏడాది నుంచి తీర్థాల గ్రామంలోని తన పుట్టింట వద్ద తన కుమారుడితో నివాసం ఉంటుంది. అయితే యల్లమ్మ కుమారుడు లింగనబోయిన దినేష్ (21) ఖమ్మంలో ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. బుధవారం ఇల్లు కడిగేందుకు విద్యుత్ మోటర్ స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కత్తితో వ్యక్తిపై దాడి : కేసు నమోదు

జూలూరుపాడు, జూలై 10: కత్తితో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన నిందితుడిపై బుధవారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని గంగారంతండా గ్రామానికి చెందిన కొర్రా రవిచందర్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన భూక్య కిషన్‌కు ఎక్స్‌కవేటర్‌కు సంబంధించిన డబ్బులు ఇచ్చాడు. అయినప్పటికీ నువ్వు నాకు డబ్బులు ఇవ్వలేదని కిషన్ మరల తనకు డబ్బులు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టి అకారణంగా మంగళవారం రవిచందర్‌తో వివాదానికి దిగాడు. కిషన్ తన చేతిలో ఉన్న కత్తిని రవిచందర్ పైకి విసిరాడు. ఈ సంఘటనలో అతనికి గాయాలయ్యాయి. చికిత్స అనంతరం దాడికి పాల్పడిన వ్యక్తిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పత్తి వైపే మొగ్గు

- గతేడాది 2.21లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది 2.23 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా
- ఇప్పటికే 97వేల ఎకరాల్లో సాగు



ఖమ్మం వ్యవసాయం, జూలై 10: రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలుకుతున్నారు. లాభదాయకంగా ఉన్న వాటినే సాగు చేసేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు. గత ఏడాది పత్తికి బాగా ధర రావడంతో, ఈసారి రైతులు వరికి బదులు, పత్తి వైపు మొగ్గు చూపుతున్నారు.

గత వానాకాలం సీజన్‌లో జిల్లాలో వరి లక్ష్యం 2,59,432 ఎకరాలకు గాను, 1,80,897 ఎకరాలను సాగు చేశారు. పత్తి 2,34,117 ఎకరాలకు గాను, 2,21,448 ఎకరాలు సాగు చేశారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో జిల్లాలో వరి లక్ష్యం 2,75,143 ఎకరాలకు గాను, జూలై మొదటి వారంలో కేవలం 3,874 ఎకరాల్లోనే నాట్లకు సిద్ధం చేశారు. అదే గత ఏడాది జూలై మాసంలో 18,482 ఎకరాలలో నాట్లు వేశారు.

కాగా ఈ ఏడాది పత్తిని 2,23,655 ఎకరాల్లో వేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉంది. జూలై మాసంలో జిల్లాలో ఇప్పటికి 97,409 ఎకరాలలో పత్తిని వేశారు. గత ఏడాది ఇదే సమయానికి ఏడు వేల ఎకరాలలో మాత్రమే పత్తిని సాగు చేశారు. పత్తి విషయంలో వ్యవసాయ శాఖ అంచనాలు మించి మూడు లక్షల ఎకరాలకు సాగు చేరే అవకాశం ఉంది. పత్తికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం, క్వింటాల్‌కు రూ. 12వేలకు పైగా ధర పలుకుతుండటంతో రైతులు దానిని సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పత్తిలో సస్యరక్షణ...

పత్తి పంటలో సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చు. సమగ్ర యాజమాన్య విధానా లు పాటిస్తే మేలు. ముందుగా పర్యావరణం దెబ్బతినకుండా పైర్లకు సోకే చీడపీడలను ఎప్పటికప్పుడు అంచనా వేయాలి. వాటి వల్ల పంటలకు ఏ విధమైన నష్టం రాకుండా తక్కువ ఖర్చుతో యాంత్రిక, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా సేద్యం చేయాలి. ఆ తర్వాత సస్యరక్షణ మందులు వాడి దిగుబడి పెంచుకోవాలి

పత్తి పంటలో ఎకువ వర్షపాతం, మబ్బులతో కూడుకున్న వాతావరణంలో పురుగు ఎకువగా వృద్ధి చెందుతుంది. తొలి దశలో విచ్చలవిడిగా రసాయన మందులను పిచికారీ చేయకుండా కాండానికి మందు పూసే పద్ధతిని పాటిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని వ్యవసా యాధికారులు సూచిస్తున్నారు. పచ్చదోమ ఎకువగా ఉన్నప్పుడు పైరు పెరుగుదల క్షీణించి మొగ్గలు రాక దిగుబడి తగ్గుతుంది. పైరు లేత దశ నుంచి పంటకాలం చివరి వరకు ఈ పురుగు ఆశిస్తుంది. 30,45 రోజుల్లో మోనోక్రోటోఫాస్, నీరు 1,4 నిష్పత్తిలో, 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్, నీరు 1.20 నిష్పత్తిలో మొక్క మొదళ్లలో పూయాలి. మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీలీటర్లు, ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫేట్ 75 యస్‌సీ 1.45 గ్రాములు లేదా ఫ్లేనికామిడ్ 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీలీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. లీటరు నీటికి 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనెను 5 మిల్లీలీటర్లు కలిపి వాడాలి.

అర్హులందరికీ

రైతు భరోసా కల్పించాలి..

ఖమ్మం కలెక్టరేట్, జూలై 10: రైతు భరోసా పథకంపై ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్, డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉ మ్మడి జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రైతులు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, లాయర్లు, జర్నలిస్టులు వివిధ వర్గాల వారు హాజరై రైతు భరోసా అమలుపై తమ అభిప్రాయాలు, సూచనలు చేశారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే...

- ఇదివరకటి రాయితీలు పునరుద్ధరించాలి
- 20 ఎకరాల వరకు రైతు భరోసా అందించాలి
- సాగు చేసే వారికే డబ్బులు అందేలా చూడాలి
- 'ధరణి' సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి
- వర్క్‌షాపులో భిన్న వర్గాల వారి అభిప్రాయాలు

- 20 ఎకరాల వరకు అమలుచేయాలి

● మందపల్లి నాగమణి, ఎంవీపాలెం,



సన్న చిన్న, మధ్యతరహా రైతులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి. గ్రామాల్లో కనీసం 20 ఎకరాలు ఉన్న రైతులకు ఈ ప్రయోజనం కల్పిస్తే ఎంతో బావుంటుంది. గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో కోట్లాది రూపాయలను బడా భూస్వాములకు కట్టబెట్టడం వలన ప్రజాధనం వృధా అయ్యింది. ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను సేకరించి వాటిని సద్వినియోగించేలా చేయడం రైతులు హర్షిస్తున్నారు.

సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలి

● తల్లపురెడ్డి నాగిరెడ్డి, లక్ష్మీపురం, ఎర్రుపాలెం మండలం



సన్న చిన్నకారు రైతులకు రైతు భరోసాని వర్తింప చేయాలి. భూకమతాలు, గుట్టలు, ఖాళీ ప్రదేశాలకు భరోసాని నిలిపివేయాలి. మండల వ్యవసాయశాఖ, ఏఈవోల సహాయంతో వాస్తవ రైతులను గుర్తించి ఈ పథకాన్ని అమలుచేస్తే బావుంటుంది.

పదెకరాలలోపు రైతులకు అవకాశం కల్పించాలి

● డాక్టర్ వై.ప్రసాద్, ఖమ్మం



5 నుంచి 10 ఎకరాల లోపు రైతులకు మాత్రమే రైతు భరోసాని కల్పించాలి. దీని వలన సన్నచిన్న కారురైతులకు అ వకాశం లభిస్తుంది. గతంలో ఎన్నో డబ్బులు వృథాగా అయ్యాయి. వీటితో ఇతర ప్రభుత్వ పథకాలకు సద్వినియోగం చేసుకునే ఆస్కారం ఉంటుంది. రైతు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందిస్తున్న డబ్బులు నిరుపేద రైతులకు ఆసరాగా ఉంటుంది.

రాయితీలను పునరుద్ధరించాలి

● శ్రీనివాసరావు, న్యాయవాది, ఖమ్మం



రైతులకు భరోసా డబ్బులతో పాటు గతంలో 2014లో గత ప్రభుత్వం నిలిపివేసిన రాయితీలను పునరుద్ధరించాలి. సబ్సిడీపై విత్తనాలు, జింక్, ఎరువులు, యాంత్రీకరణ పరికరాలు, అందిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. రైతు బంధుతో వీటన్నింటినీ రద్దు చేయడం వలన చిన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి తిరిగి వీటిని పునరుద్ధరించాలి.

ప్రతి రైతుకీ బోనస్ అందించాలి

● బొంతు రాంబాబు, రైతుసంఘం నాయకుడు



వాస్తవంగా రైతు భరోసా, రైతు బంధు కాకుండా ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఆలోచించి రైతులకు ప్రయోజనం కలిగే పథకాన్ని అమలుచేస్తే బావుంటుంది. రైతులు పండించే ప్రతి పంటకీ బోనస్‌ను అందించాలి. 1/70 పరిధిలో రైతు బంధు అందక ప్రస్తుతం వేలాది మంది రైతులు నష్టపోతున్నారు. వీటన్నింటితో పాటు కనీసం 15 ఎకరాల వరకు సాయం అందించాలి.

కోతుల సమస్యను నివారించాలి

గుత్తా వెంకటేశ్వరరావు, జన్నారం, ఏన్కూరు మండలం



సాగు చేస్తున్న ప్రతి రైతుకు పంట సాయాన్ని అందించాలి. అయితే గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు కమతాలను గుర్తించాల్సి ఉంది. గ్రామల్లో లే అవుట్లను గుర్తించి వాటిని తొలగించాలి. వాస్తవంగా పంటలను సాగుచేస్తున్న రైతులకే ప్రయోజనం కలగాలి. ప్రధానంగా ప్రభుత్వం కోతుల నివారణకు కృషిచేయాలి. ప్రతి గ్రామంలో కోతుల సమస్యలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాటిని పట్టించి రైతులకు ఆటంకం లేకుండా చేయాలి.

పంటల బీమాను అమలు చేయాలి

హేమంతరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు



పంట భరోసా కార్యక్రమాన్ని సాగుదారులందరికీ వర్తింప చేయాలి. ధరణిలో సమస్యలతో ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని వా టిని పరిష్కరించి వారికి కూడా పంట సాయాన్ని అందించాలి. కౌలు చట్టాలను కూడా సవరించి వారికి కూడా ప్రయోజనం కలిగేలా ప్రభు త్వం ఆలోచన చేయాలి. దీనితో పాటు గత ప్రభుత్వం పం టల బీమా పథకాన్ని పక్కన పెట్టింది. గ్రామాలను యూనిట్‌గా తీసుకుని ప్రతి రైతుకు బీమాను అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన విదంగా రెండున్నర ఎకరాల నుంచి 20ఎకరాల వరకు స్లాబ్ పద్ధతిలో పంటసాయాన్ని అందించాలి.

సాగు రైతులకే భరోసా కల్పించాలి

● మాదినేని రమేష్, రైతుసంఘం నాయకుడు



పంటలను సాగు చేసిన రైతులకు మాత్రమే రైతు భరోసా పథకాన్ని వర్తింప చేయాలి. 2011లో కౌలు చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తించి వారికి కూడా ఎంతో కొంత భరోసా కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది. దీనితో పాటు రైతులు టాక్స్ పే చేసిన వారికి కూడా అవకాశం కల్పించాలి. గతంలో తెల్లరేషన్ కార్డులు ప్రామాణికం అంటున్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెల్లకార్డులు ఇవ్వలేదు. ఫలితంగా రైతులకు నష్టం వాటిల్లుతుంది. ఈ నిబంధనను తొలగించి 15 ఎకరాల లోపు రైతులకు అవకాశాన్ని కల్పించాలి.

భూమి పట్టాలు లేని వారికి భరోసా ఇవ్వాలి

● మొట్టెల కృష్ణ, ఇల్లెందు



పెత్తందార్లకు, భూస్వాములకు రైతు బంధు ఇచ్చారు. ఆ విధానాన్ని మానుకోవాలి. ఏజెన్సీ ప్రాంతంలో ఎంతో 90శాతం మంది రైతులకు భూములను సాగు చేసుకుంటున్నా చట్టాల కారణంగా పట్టా పుస్తకాలు రాలేదని ఫలితంగా ప్రభుత్వం నుంచి అందే ఏ రాయితీలు అందడం లేదు. ప్రభుత్వం స్పందించి ఏజెన్సీ ప్రాంతంలో పట్టాపుస్తకాలు లేని వారికీ రైతు భరోసాని అందిచాలి.

కౌలు రైతులను ఆదుకోవాలి

- భోజ్యా నాయక్, చంద్రుగొండ



ప్రస్తుతం కౌలు రైతులకు పంట సాయం అందడం లేదు. వాస్తవంగా కౌలు రైతులే సాగు చేస్తున్నారు. అయితే రైతులకు, కౌలు రైతులకు మధ్య ప్రభుత్వం ప్రత్యేకంగా జీవోలు అమలుచేసి వారికి కూడా పంటసాయాన్ని అందించి భరోసా కల్పించాలి. 10 ఎకరాలు ఉన్న ప్రతి రైతుకు భరోసా అందించాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంతో మంది రైతులు సాగు దారులైనప్పటికీ పంట సాయం, బీమా, పథకాలేవీ వర్తించడం లేదు.

అంతర్‌రాష్ట్ర నేరస్తురాలి అరెస్ట్

- 112గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ
- వివరాలు వెల్లడించిన కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు

సత్తుపల్లిరూరల్, జూలై10: అంతర్‌రాష్ట్ర నేరస్తురాలిని సత్తుపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 8వ తేదీన సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో అప్పుడే బ్యాంక్‌లో రిలీజ్ చేసుకుని వెంట తెచ్చుకున్న 112 గ్రాముల బంగారు ఆభరణాలతో స్వగ్రామం వెళ్తున్న పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన ఓ మహిళ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. అదేరోజు సత్తుపల్లి బస్టాండ్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సత్తుపల్లి బస్టాండ్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో నుంచి పారిపోతున్న ఓ మహిళను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. విచారణలో తనది ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు మండలం పెద్ద



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అనిశెట్టి రఘు

చెరువుగట్టుకు చెందిన దేవరకొండ దుర్గ అని తేలింది. కుటుంబ అవసరాల నిమిత్తం డబ్బు సంపాదించాలనే ఆలోచనలో ఒంటరి ప్రయాణీకులను ఆసరా చేసుకుని వారి వద్ద సంచులను దొంగిలాస్తానని, ఈ క్రమంలో బంగారు ఆభరణాలను కరిగించేందుకు వస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. విచారణలో నేరం అంగీకరించడంతో పాటు ఆమె వద్ద నుంచి చంద్రహారం, 2చైన్లు, 3ఉంగరాలు, 4గాజులు స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ టీ.కిరణ్, హెడ్ కానిస్టేబుల్ ఇజ్జగాని చెన్నారావు ఉన్నారు.

గుండెపోటుతో దమ్మపేట ఎస్ఐ మృతి



సీమానాయక్(ఫైల్)

దమ్మపేట, జూలై 10: భద్రాద్రి జిల్లా దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సీమానాయక్ (60) బుధవారం గుండెపోటుతో ఖమ్మంలోని ఆయన నివాసంలో మృతి చెందారు. దమ్మపేటలో రెండు రోజుల క్రితం విధులు నిర్వహించి ఖమ్మం వెళ్లాడు. తిరిగి విధులకు హాజరయ్యేందుకు ఖమ్మం నుంచి దమ్మపేటకు వచ్చేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక వైద్యశాలకు తీసుకువెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మృతివార్త తెలియడంతో దమ్మపేట స్టేషన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సీమానాయక్ మృతి పట్ల దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి, ఏఎస్ఐ ప్రతాప్, సిబ్బంది సంతాపం తెలిపారు.


జలకళను సంతరించుకున్న సింగభూపాలెం చెరువు

● 6 అడుగులకు చేరుకున్న నీటి మట్టం

సుజాతనగర్, జూలై 10: సుజాతనగర్ మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. అంతేకాకుండా సింగభూపాలెం చెరువుకు వరద పోటెత్తడంతో సుమారు 3 అడుగుల వర్షపు నీరు చెరువుకు చేరింది. చెరువు పూర్తిగా నిండడానికి 20 అడుగుల మేర నీటి నిల్వ లభ్యత ఉండగా, దీనితో బుధవారం చెరువులో ప్రస్తుత నీటి మట్టం 6 అడుగుల మేర చేరడంతో చెరువు జలకళను సంతరించుకుంది.



నీటితో కళకళలాడుతున్న సింగభూపాలెం చెరువు



సకాలంలో రుణాలు చెల్లించేలా చర్యలు : ఏపీడీ నూరుద్దీన్



సత్తుపల్లి,జూలై10: మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీడీ నూరుద్దీన్ సూచించారు. బుధవారం సత్తుపల్లి, వేంసూరు మండలాల వీవోఏలు, సెర్ప్ అంశాలపై ఆయన స్థానిక స్త్రీశక్తి భవనంలో రివ్యూ నిర్వహించారు. ఎన్‌పీఏ రికవరీ, ఐబీ లోన్, ప్రతినెలా జరిగే లైవ్ మీటింగ్స్ రెగ్యులర్‌గా జరిపించేలా చర్యలు, మార్చి 2014నుంచి 2023 ఫిబ్రవరి వరకు ఆయా గ్రూపులలో బ్యాంక్ నిల్వలు, మహిళా శక్తి పథకాల, మీ సేవా కేంద్రాలు, పాడి పరిశ్రమలు, కోళ్ల పెంపకం, చేపలు పెంపకం, క్యాంటీన్ నిర్వహణపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్ఎం బీమా నాయక్, ఏపీఎంలు కేవీ.సుబ్బారావు, శ్రీనివాసరావు, డ్వాక్రా ఈవో రత్నకుమారి, డీఎంజీ జనార్ధనారావు, సీసీలు వీవోలు పాల్గొన్నారు.

పరిశీలనకే పరిమితమైన వందపడకల ఆసుపత్రి

- వైరాలో ఏడాదిగా ముందుకు సాగని పనులు



వైరా, జూలై10: సంవత్సరం కిందట వైరాకు మంజూరైన వందపడకల ఆసుపత్రి ఏర్పాటు నేటికీ కార్యరూపం దాల్చలేదు. గత ఏడాది జూలైలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వైరాకు వందపడకల ఆసుపత్రిని మంజూరు చేసింది. దాదాపు రూ.36కోట్ల నిధులను కూడా మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. దాదాపు 98మంది సిబ్బందిని కూడా కేటాయిస్తూ ఆదేశాలిచ్చింది. ఆతర్వాత కొన్నినెలలకే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆసుపత్రి ఏర్పాటు మరుగున పడిపోయింది. డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైరాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చొరవతో ఈ ఆసుపత్రి ఏర్పాటుకు సంబంధించి కొంత కదలిక వచ్చింది. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క స్థానిక తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావును ఆదేశించారు. దాంతో గత ప్రభుత్వంలో మినీస్టేడియం నిర్మాణానికి సేకరించిన గురుకుల పాఠశాలలోని స్థలాన్ని ఈ ఆసుపత్రి ఏర్పాటు కోసం తహసీల్దార్ ప్రతిపాదించారు. ఇప్పటికిప్పుడే శాశ్విత భవనాలు నిర్మించి ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు కనీసం సంవత్సరకాలమైనా పడుతుందనే ఉద్దేశ్యంతో యుద్ధప్రాతిపదికన తాత్కాలిక భవనాల్లో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రైవేట్ భవనాలను సమకూర్చాలని సూచించారు. ఆవెంటనే గతనెల పదోతేదీన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అప్పటి జిల్లాలోని ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు కేవీసీఎం విద్యాసంస్థలకు చెందిన భవనాలను పరిశీలించి అక్కడ తాత్కాలికంగా ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భవనాల పరిశీలన, నిర్ణయం జరిగి నెలరోజులైనా ఇంతవరకు అతీగతీ లేదు. కొద్దిరోజుల కిందట కేవీసీఎం విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆభవనాలు ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. అక్కడ తాత్కాలికంగా ఆసుపత్రి ఏర్పాటుకు ఎలాంటి అడ్డంకులు కూడా లేవు. అంతేకాకుండా దాదాపు ఏడెనిమిదేళ్ల కిందట పశుగణాభివృద్ధి సంస్థ నిర్మించిన రైతు శిక్షణా భవనం నేటికీ ప్రారంభం కాకుండా నిరుపయోగంగా ఉంది. ఆభవనంలోనైనా ఆసుపత్రిని ఏర్పాటు చేసే అవకాశముంది. ఈ ఆసుపత్రి ఏర్పాటుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చిత్తశుద్ధి కొరవడిందనే విమర్శలు విన్పిస్తోన్నాయి. ఇప్పటికైనా జాప్యం లేకుండా అందుబాటులో ఉన్న భవనాల్లో తాత్కాలికంగా ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

నగర పాలక సంస్థలో బదిలీల హడావుడి

జూనియర్ అసిస్టెంట్లకు బదిలీలపై గందరగోళం



ఖమ్మంకార్పొరేషన్, జూలై9: ఖమ్మం నగర పాలకసంస్థలో బదిలీల హడావుడి నెలకొంది. ఈనెల 20లోగా బదిలీల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. నాలుగేళ్లగా పని చేస్తున్న ఉద్యోగులను బదిలీలు చేయనున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పలువురు ఉద్యోగులు డిప్యుటేషన్‌పై ఖమ్మం రావటంతో వారికి బదిలీలు కావని అంటున్నారు. ఇక సీనియర్ అసిస్టెంట్లు, అక్కౌంటెంట్ విభాగంలోని సీనియర్,జూనియర్ అక్కౌం టెంట్లకు, రెవెన్యూ విభాగంలో బిల్‌కలెక్టర్లకు, ఇంజనీరింగ్ విభాగంలో 4ఏళ్లగా పనిచేస్తున్న వారిని, జనన,మరణ ధ్రువీకరణ విభాగంలో బదిలీలు ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే వరంగల్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి సీనియారిటీ జాబితా తయారుకాగా, ఈనెల 12 వరకు బదిలీ ఆప్షన్‌కు అవకాశం ఇస్తారు. జూనియర్ అసి సెంట్లను, బిల్ కలెక్టర్లను జిల్లాలోనే బదిలీ చేయనుండగా, సీనియర్ అసిస్టెంట్లను జోన్-4 పరిధిలో బదిలీలు చేస్తారు. జోన్-4 పరిధిలో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలు వస్తాయి.

జూనియర్ అసిస్టెంట్లు, బిల్‌కలెక్టర్లకు జిల్లా పరిధిలోనే

జూనియర్ అసిస్టెంట్లకు, బిల్‌కలెక్టర్లకు జిల్లా పరిధిలోనే బదిలీలు ఉంటాయి. వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలకు బదిలీలు చేస్తారు. కాగా ప్రస్తుతం ఖమ్మంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ల బదిలీ విషయంలో గందరగోళం నెలకొంది. ఎందుకంటే అధికారులు విడుదల చేసిన ఖాళీల జాబితా ప్రకారం వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా లేవు. అంతేకాకుండా ఆయా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు నాలుగేళ్ల సర్వీస్ లేదు. అయినప్పటికీ నాలుగేళ్ల పనిచేసిన బిల్‌కలెక్టర్ల జాబితాను తయారు చేయటంతో వారిని ఎక్కడకు బదిలీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది, ఇక ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న 8మంది బిల్‌కలెక్టర్లకు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో డిప్యుటేషన్ అధికారులే..

టౌన్‌ప్లానింగ్ విభాగంలో మణుగూరు, కొత్తగూడెం, రామగుండం తదితర ప్రాంతాల నుంచి ఖమ్మం డిప్యుటేషన్‌పై వచ్చిన వారూ ఉన్నారు. అందులో ఒకరు మాత్రమే నాలుగేళ్లగా పనిచేస్తున్నారు. అతడికి కొత్తగూడెం నుంచి బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఇక ప్రస్తుతం పని చేస్తున్న వారికి నాలుగేళ్ల సర్వీస్ పూర్తికాలేదు. దీంతో టౌన్‌ప్లానింగ్ విభాగంలో బదిలీలు లేనట్లే

పలు విభాగాల్లో బదిలీలు తప్పనిసరి

ఇంజనీరింగ్ విభాగంలో ఒకరిద్దరకిఇ బదిలీలు కానుండగా, అక్కౌంటింగ్ విభాగంలో సీనియర్, జూనియర్ అక్కౌంటెంట్‌లకు బదిలీ కానుంది. ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు బదిలీ తప్పనిసరి. కాగా పబ్లిక్‌హెల్త్ విభాగంలో పలువురు బదిలీ కానున్నారు.

నూతన రవాణా చట్టం రద్దు చేయాలని వినతి

ఖమ్మంసంక్షేమవిభాగం,జూలై10: అనుకోకుండా జరిగే రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లుకు కఠిన శిక్షలను విధిస్తూ తీసుకొచ్చిన నూతన రవాణా చట్టాలను తక్షణమే రద్దు చేయాలని ఇన్‌చార్జ్ డీటీవోవెంకటరమణకు సీఐటీయూ నాయకులు విన్నవించారు. డీటీవో కార్యాలయంలో బుధవారం నాయకులు వై విక్రమ్, ఉపేందర్ కలిసి డ్రైవర్ల ఇబ్బందులను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న జరిమానాలను తొలగించాలని కోరారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల వేదింపులపై చట్టాలను తీసుకరావాలని కోరారు. నాయకులు రాందాస్, సాగర్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపుకార్డులివ్వాలి

తల్లాడ, జూలై10: కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం కుర్నవల్లిలో నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన ఆ పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శీలం సత్యనారాయణరెడ్డి, పకీరమ్మ, పులి కృష్ణయ్య, కల్యాణపు కృష్ణయ్య, వంగూరి లోకేశ్వర రావు, తెనాలి కృష్ణమ్మ, చల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం

రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి/ తిరుమలాయపాలెం జూలై10: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవెవిన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పోచారంలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని వృద్ధురాలితో కలిసి ప్రారంభించారు. అనంతరం నాయకన్‌గూడెంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కోదాడ-నాయకన్‌గూడెం రహదారిపై ఈశ్వరమాధారంలో నిర్మించిన హైలెవల్ వంతెనను ప్రారంభించారు. కాల్వ పరిమాణం ఎంత ఉంటే అంత వెడల్పులో బ్రిడ్జి కట్టాల్సి ఉండగా, తక్కువగా కట్టడంతో అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో కాల్వలో వరదనీరు ఎక్కువగా వస్తే ఎలా.. అంటూ ప్రశ్నించారు. ఇకనుంచి కోదాడ-నాయకన్‌గూడెం రహదారిపై ఆర్టీసీ బస్సు సర్వీసులు పునరుద్ధరిస్తామన్నారు. అనంతరం పలువురు వ్యక్తిగత సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు అందించారు. వెంటనే పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





పోచారంలో వృద్ధురాలితో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, రాకాసితండాలో మాట్లాడుతున్న మంత్రి

ప్రతీ ఎకరానికి సాగు నీరు

తిరుమలాయపాలెం: పాలేరు నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి శాశ్వత సాగునీరు అందించడమే లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాశాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అజ్మీరతండా నుంచి రాకాసితండా వరకు ఆకేరునదిపై నిర్మించిన అంతర్‌జిల్లా బ్రిడ్జి,చెక్‌డ్యాంను ప్రారంభించారు. సీతారామ ద్వారా గోదావరి జలాలను పాలేరుకు తరలించి ఈప్రాంతాన్ని సస్యశ్యా మలం చేస్తున్నట్టు తెలిపారు. ఆకేరు నది పరివాహక ప్రాంతం నుంచి వృధాగా పోతున్న వర్షపు నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించి సాగునీరు అందిస్తామన్నారు. రాకాసితండానుంచి డోర్నకల్ మండలం చిలుక్కోయల పాడు వరకు మిగిలిన ఉన్న 2కి.మీ. బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేస్తామన్నారు. అనంతరం రాకాసితండావద్ద బ్రిడ్జివద్ద వివిధ రకాల మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో మహిళ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఎంపీపీ బోడ మంగిలాల్, జడ్పీటీసీ బెల్లం శ్రీను, జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో శేషాద్రి, ఏవో సీతారాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాలాజీ, రవి, కేశ్యానాయక్, ఎన్నం సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చింతకాని, జూలై10: మండల పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన దొబ్బల ఈశ్వరమ్మకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పెంట్యాల అప్పారావు, కొల్లి గోవిందరావు, దొబ్బల నరసింహారావు పాల్గొన్నారు.

స్కూటీలో చెలరేగిన మంటలు

ముదిగొండ,జూలై10: మంటలు చెలరేగి స్కూటీ దగ్ధమైంది. ఈ సంఘటన ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామసమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. ఖమ్మం నుంచి నేలకొండపల్లి వైపు స్కూటీపై గోనె సంచులు తీసుకొని ఓ యువకుడు వెళ్తుండగా సంచులు సైలెన్సర్‌కు తగలడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఆయువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

ఎస్‌బీఐటీలో ప్రాంగణ నియామకాలు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై10: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో కళాశాలకు చెందిన 11మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఛైర్మెన్ గుండాల కృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

చెట్ల సంరక్షణ బాధ్యతగా భావించాలి

- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

వైరా, జూలై10: పర్యావరణాన్ని కాపాడుకొనేందుకు చెట్ల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచించారు. వైరా జూనియర్ కళాశాల, హైస్కూల్ ఆవరణాల్లో బుధవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, కౌన్సిలర్లు బత్తుల గీత, డాక్టర్ డి.కోటయ్య, గుడిహూడి సురేష్, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంఈవో వెంకటేశ్వర్లు,ఏఎస్ఐ డి.వెంకటనారాయణ, మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: ప్రతి ఒక్కరు కనీసంగా ఒక మొక్కనైనా నాటాలని, నాటిన మొక్కను పరిరక్షించాలని నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.గురవయ్య పిలుపునిచ్చారు. బుధవారం నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపుగా 60 మొక్కల వరకు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆమోస్, అధ్యాపకులు భరత్, సూర్యప్రకాష్, భాస్కర్, సోమేశ్వరరావు, బాలకృష్ణ, ప్రమోద్, లైబ్రేరియన్ రమాదేవి,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



:నేలకొండపల్లి జూనియర్ కళాశాలలో..

బోనకల్: మండలంలోని అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో బుధవారం కళాశాల, పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఎల్. రాజు, వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్, ప్రిన్సిపాల్ నళినిశ్రీ, ఎంఈవో శాస్త్రీ, ఏపీవో కృష్ణకుమారి, గిర్ధావర్ లక్ష్మణ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా: డ్రైవర్‌కు తీవ్రగాయాలు

మధిరరూరల్, జూలై10: మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామసమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపటంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మడుపల్లి గ్రామానికి చెందిన అంకె రమేష్ రాత్రి 12గంటల సమయంలో మడుపల్లి నుంచి కారులో తన సోదరుడితో కలిసి మధిర వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో మడుపల్లి దాటిన తర్వాత ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే క్రమంలో కారు కుడివైపు పొలాల్లోకి దూసుకు వెళ్లి సమాధిని ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. కారు ముందు భాగం బాగా నుజ్జయింది. కారులోని రమేష్ సోదరుడికి ఎటువంటి గాయాలు కాలేదు.

తుమ్మలకు కార్పొరేటర్లు, నాయకుల అభినందనలు



ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై10: జిల్లా నుంచి నిర్మాణం చేస్తున్న జాతీయ రహదారులపై జిల్లా ప్రజలకు అనుకూలమైన రవాణా మార్గం మార్పులు చేసి సుగమం చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అభినందనల వెల్లువ వచ్చింది. ఖమ్మం నుంచి దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కారణంగా ఖమ్మం శివారులోని దంసలాపురం వద్ద రాకపోకలకు మార్గం సుగమం చేస్తూ బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. దీంతో దంసలాపురం, శ్రీరామ్‌హిల్స్, అగ్రహారం, రామకృష్ణాపురం, గాంధీనగర్, ఖమ్మం నగరంలోని 16, 17, 18, 19 డివిజన్ ప్రాంతాల ప్రజాప్రతినిదులు కలిసి ఖమ్మంలో మంత్రి తుమ్మలను సన్మానించి అభినందనలు తెలిపారు. స్థానికంగా ఎగ్జిట్, ఎంట్రీ మార్గాలను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు కమర్తపు మురళీ, మేడారపు వెంకటేశ్వర్లు, మదూరి ప్రసాద్, ఆళ్ల శిరీష అంజిరెడ్డి, మందడపు బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానుకొండ శ్రీధర్‌కు నివాళులు

ఖమ్మం ఏఎంసీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ కుమారుడు మానుకొండ శ్రీధర్ తొలి వర్ధంతి కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని శ్రీధర్‌కు నివాళులు అర్పించారు. బుధవారం మానుకొండ మామిడితోటలో ఏర్పాటు చేసిన శ్రీధర్ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు.

గోదాంలో అక్రమాలకు పాల్పడితే వేటే

- జేసీ మధుసూదన్ నాయక్
- గోదాం ఇన్‌చార్జ్‌లపై ఆగ్రహం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మంరూరల్,జూలై10:బియ్యం గోదాంలో అక్రమాలకు పాల్పడితే వారిని సస్పెండ్ చేస్తామని జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ హెచ్చరించారు. ఖమ్మంరూరల్ మండలం బియ్యం గోదాంలో రేషన్ డీలర్లకు అందించే బియ్యంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని... 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితమవటం తెలిసిందే. ఈ కథనాలకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని 8గోదాంలకు సంబంధించిన ఇన్‌చార్జీలు, హమాలీలు అధ్యక్ష, కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శలతో సమావేశం నిర్వహిం చారు. గోదాం ఇన్‌చార్జీలపై జేసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు అందించే బియ్యంలో ఎందుకు అక్రమాలకు పాల్పడుతున్నారని నిలదీశారు. ఇప్పటి నుంచి గోదాంలో డీలర్లకు క్వింటాల లోనే కాంటా పెట్టి అందించాలని ఆదేశించారు. బస్తాలు లోడు అయిన లారీలు డీలర్ల దుకాణం వద్దకు చేరే వరకు మధ్యలో ఎక్కడా లారీ ఆగకూడకుండా నేరుగా వెల్లాలని ఆదేశిం చారు. గోదాంలో కాని, లారీల్లో కాని ఒక్క కేజీ బియ్యం అక్రమం జరిగినా ఉపేక్షించేది లేదని వెంటనే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోదాం ఇన్‌చార్జీలు, డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బానత్ వెంకన్న, షేక్ జానీ మియా, దుర్గయ్య, బిందు మాధవి పాల్గొన్నారు.

కన్నుల పండువగా జగన్నాథ రథోత్సవం

- ఇస్కాన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో వేడుక

ఖమ్మంసాంస్కృతికం, జూలై 10: జగన్నాథ రథయాత్ర మహోత్సవం ఇస్కాన్‌సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో కన్నుల పండువగా జరిగింది. ఉత్సవంలో పాల్గొనేందుకు తిరుపతి, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల ఇస్కాన్ ప్రతినిధులు, భక్తులు హాజరయ్యారు. ఇస్కాన్ బాధ్యులు విష్ణుస్వామిదాస్, జీవదాస్, సుఖదేవ మహారాజ్, నిత్యముక్త ప్రభు, రామలక్ష్మణ దాస్, కింకిణీదాస్, తదితరుల ఆధ్వర్యంలో సంప్రదాయ వస్త్రాలు, నుదుట బొట్లు ధరించిన మహిళలు, పురుషులు డప్పు వాద్యాలు భజనలు చేస్తూ ముందుకు కదిలారు. పూరీలో లక్షలాది మంది భక్తుల మధ్య కొనసాగే రథయాత్రను ఇస్కాన్ గతేడాది నుంచి ఖమ్మం నగరంలోని నిర్వహిస్తోంది. దీంతో పూరీ పుణ్యక్షేత్రాన్నిదర్శించలేని రథయాత్రలో పాల్గొనే అవకాశం దక్కని వారికి స్థానికంగా నిర్వహిస్తున్న రథయాత్ర ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తోంది. బలభద్ర, సుభద్రల సమేతంగా శ్రీకృష్ణుడు నగర వీధుల్లో రథసంచారం చేశారు. పూరీ జగన్నాథ ఆలయం వద్ద నిర్వహించే జగన్నాథ రథయాత్ర నమూనాను ఖమ్మంలో ప్రదర్శించటంతో నగర వాసులు శ్రీకృష్ణభక్తులు, ఇస్కాన్ అనుచరులు అధిక సంఖ్యలో ఆసక్తిగా తిలకించారు. రథానికి కట్టిన తాళ్లను పట్టి లాగటం ద్వారా ఉత్సవమూర్తుల సేవ చేసేందుకు దారి పొడవునా భక్తులు పోటీ పడ్డారు. సాయంత్రం భజనలు, జగన్నాథ లీల కథ, మహాహారతి, మహాప్రసాద వితరణ చేశారు.



రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరు, జూలై 10: కల్లూరులో సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని తహసీల్దార్ పి.సాంబశివుడు బుధవారం ప్రారంభించారు. మరో 20 మంది మహిళలకు రూ.1.60 లక్షల విలువగల కుట్టుమిషన్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి పీ.ఎనోష్ కుమార్ మాట్లాడుతూ సంస్థ తరుపున మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికి మూడు బ్యాచ్‌లకు గాను 60 మదికి పైగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వటమే కాకుండ ఉచితంగా రూ. 8వేలు విలువ గల కుట్టు మిషన్లు అందించామన్నారు. సంస్థ తరుపున శిక్షణ పూర్తి చేసుకున్న వారికి గాను ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్‌డిఆర్ సేవ సంస్థ తరుపున చంద్రలీలా, ప్రముఖులు మట్టూరి జనార్థన్, కాటేపల్లి రజనీ, కొరకొప్పు ప్రసాద్, పోట్రు కిరణ్‌కుమార్, పాస్టర్లు సంజీవరావు,సుందర్‌రావు, జీవన్‌కుమార్,శ్యాంసన్ పాల్గొన్నారు.

అసంఘటితరంగ కార్మికులను ఆదుకోవాలి

తల్లాడ,జూలై10: అసంఘటితరంగ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.వెంకన్న, జి. రామయ్య డిమాండ్ చేశారు. బుధవారం తల్లాడలో పఠాన్ నాగూల్‌మీరా అధ్యక్షతన తల్లాడ, ఏన్కూరు ఏరియా ఐదో మహాసభ జరిగింది. షేక్.లాల్‌మియా, వై.బాబు, డి.శ్రీనివాసరావు, కె.పుల్లారావు, మాస్‌లైన్ మండల కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు ప్రసంగించారు. అనంతరం అధ్యక్షుడిగా పఠాన్ నాగూల్‌మీరా, ఉపాధ్యక్షుడిగా సత్యం, రమణ, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా షేక్. లాల్‌మియా, సీహెచ్.రాఘవ,కోశాధికారిగా జీ.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై10: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించిన చెన్నూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామళ్ల సత్యం కోరారు. బుధవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పలు పాఠశాలల్లో నోట్‌బుక్స్ వితరణ

పెనుబల్లి, జూలై 10: వీఎంబంజర్ సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌పుస్తకాలను బుధవారం అందజేశారు. మండలంలోని 14 పాఠశాలల్లో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఛైర్మన్ షేక్.అబ్దుల్‌కలాం, అధ్యక్షుడు చీదిరాల సుబ్బారావు, మిట్టపల్లి శ్రీధర్, కారుమంచి ఆనంద్, కొన్నగంటి వినాయకప్రసాద్ పాల్గొన్నారు.

సేవల ద్వారానే గుర్తింపు

తిరుమలాయపాలెం, జూలై10: ఉపాధ్యాయులు తాము పని చేసిన చోట చేసిన సేవలే మంచి గుర్తింపునిస్తాయని తెట్టలపాడు ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఉన్నత పాఠశాలలో పనిచేసి పదోన్నతిపై వెళుతున్న సిలివేరు ఉపేందర్, లక్ష్మి అనే ఉపాధ్యాయులను విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

శ్రీచైతన్య ఇంజనీరింగ్ విద్యార్థులకు ఐబీఎం ఇంటర్నేషనల్ సర్టిఫికెట్స్ ప్రదానం

ఖమ్మంరూరల్, జూలై 10: మండల పరిధిలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఐబీఎం కంపెనీ వారు నిర్వహించిన శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్‌లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ కాలేజీలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఐబీఎం కంపెనీతో ఎంఓయూ కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్.అనిల్, ఏవో వైశాలి, హెచ్ఓడీలు డాక్టర్ రాజేష్, హరిప్రసాద్, కృష్ణ, డాక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కల్లూరు, జూలై 10: కల్లూరు పంచాయితీ పరిధిలోని ఖాన్‌ఖాన్‌పేట గ్రామంలో ఓ బాలిక అదృశ్యంపై బుధవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు ప్రకారం మంగళవారం బాలిక తన ఇంటి వెళ్లి పోయినట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ కళాశాలలో ఇంటర్ చదువుతుంది.